ఈనాడు తిరుపతి
బుధవారం అక్టోబరు 9, 2024



ఇల వైకుంఠం మురిసింది.. భక్తజన సంద్రంలో ఓలలాడింది.. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి కరుణాకటాక్షాలు.. మిన్నంటిన గోవింద నామస్మరణలతో సప్తగిరులు పులకించాయి. నీ కీర్తన శ్రవణానంద దాయకం.. నీ సాకారం నయనానందకరం.. నీ ప్రసాదం జిహ్వానందదాయకం.. అంటూ ఆ శ్రీనివాసుడి సేవలో తన్మయానందభరితులయ్యారు. తనకు అత్యంత ఇష్టమైన గరుడ వాహనం అధిరోహించి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ ఉభయ దేవేరులతో ఆ మలయప్పస్వామి అభయప్రదానం చేస్తుండగా.. లక్షలాది మంది భక్తులు జయజయధ్వానాలు పలికారు. మూర్తీభవించిన ఆ విశ్వాంతర్యామి వైభవాన్ని కనులారా వీక్షించి.. మనసారా స్మరించి భావోద్వేగంతో పులకించారు.



- న్యూస్‌టుడే, తిరుమల

భక్తులే కొండంతా..

ప్రణమిల్లిన గరుడుడు.. శోభిల్లిన దేవదేవుడు

తిరుమలలో మిన్నంటిన గోవింద నామస్మరణ

శ్రీహరే మనసంతా





మలయప్పస్వామివారు మంగళవారం ఉదయం మోహినీ రూపంలో శృంగార రసాధి దేవతగా సర్వాలంకార భూషితుడై దర్శనమిచ్చారు. పక్కనే మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై అభయమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భజనలు, కోలాటాలు, జీయంగార్ల గోష్ఠి, మంగళవాయిద్యాల నడుమ వాహన సేవ కోలాహలంగా సాగింది. రాక్షసులను మోహింపజేసిన జగన్నాథుడు జగన్మోహినిగా బంగారు పల్లకిలో సిగ్గులు ఒలకబోస్తూ కనువిందు చేశారు. క్షీరసాగర మథనంలో లభించిన అమృతాన్ని దేవతలకు పంచిపెట్టడానికి స్వయంగా బంగారు వాలుజడ ధరించి, భువన మోహన రూపిణియై మోహినీ అవతారాన్ని దాల్చారు. ఈ అలంకారం ద్వారా జగత్తు అంతా మాయామోహానికి లొంగి ఉందని, అదంతా తన లీలా విలాసమేనని, తన భక్తులు కానివారు ఈ జగన్మాయలో లులు కాకతప్పదని స్వామివారు ఈ రూపంలో చాటి చెబుతున్నారు.

దాసానుదాస ప్రవృత్తికి దాసుడై

మలయప్ప స్వామివారు సాయంత్రం 6.30 గంటలకు గరుడ వాహనంపై ఊరేగి భక్తులను కటాక్షించారు. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని చెబుతారు. జ్ఞాన వైరాగ్య ప్రాప్తికోరే మానవులు గరుడున్ని దర్శిస్తే సర్వపాపాలు తొలుగుతాయని భక్తకోటికి సందేశాన్నిచ్చారు. స్వామివారి వాహనాన్ని స్వయంగా తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి మోశారు.







నేడు స్వర్ణ రథోత్సవం
స్వర్ణ రథోత్సవం బుధవారం సాయంత్రం వైభవంగా జరగనుంది.

● బుధవారం ఉదయం హనుమంత, రాత్రి గజవాహన సేవలు జరగనున్నాయి.

మోహినీ అలంకారం, మరో తిరుచ్చిపై కృష్ణస్వామి

గరుడోత్సవ విశేషాలు

➡ శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీల్లో ఉదయాన్నే భక్తులు నిండిపోయారు. మధ్యాహ్నం ఎండవేడిమికి తట్టుకోలేక గొడుగులు, చీరలు అడ్డుపెట్టుకున్నారు. సాయంత్రం గుడి ఆవరణలో వర్షం కురవడంతో భక్తులు ఉపశమనం పొందారు.

➡ గ్యాలరీల్లో చేసిన ఏర్పాట్లపై ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి భక్తులతో స్వయంగా మాట్లాడారు. వారి సమస్యలను అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు పరిష్కరించారు.

➡ ప్రత్యేక వాహనంలో వైద్యులు, సిబ్బంది భక్తులకు అందుబాటులో ఉంటూ మందులు అందజేశారు.

➡ తిరుమలలో భక్తుల రద్దీ పెరగడంతో వాహనాలను జీఎన్‌సీ నుంచి రింగురోడ్డు మీదుగా మళ్లించారు. భక్తులు అక్కడి నుంచి నడుచుకుంటూ మాడవీధులకు తరలివెళ్లారు. గరుడసేవను సుమారు మూడు లక్షల మంది భక్తులు వీక్షించినట్లు అంచనా.

➡ తప్పిపోయిన ఎనిమిది మంది భక్తులను జియో ట్యాగ్ సాయంతో వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ సౌజన్య తెలిపారు.


➡ గ్యాలరీల్లోకి రాలేని భక్తులను సాయంత్రం ఒక్కసారిగా అనుమతించడంతో తోపులాటలు చోటుచేసుకున్నాయి. పోలీసులు ఈ ప్రదేశంలో ముందు జాగ్రత్త చర్యల్లో విఫలమైనట్లు భక్తులు ఆరోపించారు.

➡ దాదాపు 1500 మంది శ్రీవారి సేవకులు 200 గ్యాలరీల్లోని దాదాపు రెండు లక్షల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

➡ తిరుపతి నుంచి 404 బస్సుల్లో 5,145 ట్రిప్పులతో 1,77,577 మంది భక్తులను తిరుమలకు తరలించినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్ రెడ్డి తెలిపారు.



భక్తులను గ్యాలరీల్లోకి అనుమతిస్తున్న పోలీసులు



నిఘా నేత్రాలతో భద్రత పర్యవేక్షిస్తూ..



భక్తులతో మాట్లాడుతున్న ఈవో, ఏఈవో



అల్పాహారం పంపిణీ చేస్తూ..



ఎండ వేడిమిని తప్పించుకునేందుకు..

14 నుంచి పల్లె పండుగ వారోత్సవాలు

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లా పరిధిలో ఈ నెల 14 నుంచి పల్లె పండుగ వారోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.74 కోట్లు మంజూరు చేశామని, మిగిలిన రూ.25 కోట్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

జగనన్న కాలనీలో స్థల సర్వే

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట పురపాలక సంఘం తుమ్మూరు పరిధిలోని జగనన్న కాలనీకి అడ్డంగా వైకాపా యువ నాయకుడు కంచె వేయడంతో మండల రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే చేశారు. ఇక్కడి జగనన్న పక్కా ఇళ్లకు ఎదురుగా రోడ్డు ఆనుకుని ఉండే భూమి తమదని వైకాపా నాయకుడు కంచె వేశారు. దీనిపై 'ఈనాడు'లో 'జగనన్న కాలనీకి ఎదుట కంచె' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన సర్వేయర్ చరణ్, వీఆర్వో పద్మనాభరెడ్డి కాలనీ వద్ద సర్వే చేశారు. పూర్తిస్థాయిలో సర్వే చేసి వివరాలు వెల్లడించాల్సి ఉందని సర్వేయర్ పేర్కొన్నారు.



నాయుడుపేట తుమ్మూరు పరిధిలోని జగనన్న కాలనీ వద్ద సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఈనాడు కథనానికి స్పందన

దారులన్నీ గరుడ కూడలి వైపు

- ద్విచక్ర, ట్యాక్సీ వాహనాల నిషేధం
- సొంత వాహనాలు 4.35కు నిలుపుదల



గరుడ కూడలి వద్ద వాహన పాసులు పరిశీలించి అనుమతిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం, జీవకోన), న్యూస్‌టుడే: గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీవేంకటేశ్వర స్వామి కటాక్షం కోసం భక్తకోటి దారులన్నీ అలిపిరి గరుడ కూడలి వైపు కదిలాయి. తిరుమలలో వాహన సామర్థ్యం నిండిపోయిందని నిలిపివేసేలా వాహన రద్దీ నెలకొంది. గరుడ వాహన సేవ రోజు భక్తుల తాకిడిని గుర్తించిన తితిదే, పోలీసు శాఖ మంగళవారం ద్విచక్ర వాహనాలు, ట్యాక్సీలను పూర్తిగా ఘాట్ రోడ్డులో నిషేధించారు. ముందు రోజు రాత్రి నుంచి గరుడ వాహన సేవ మరుసటి రోజు ఉదయం వరకు నిషేధాజ్ఞలు కొనసాగాయి.

తిరుమలలో 8 వేల వాహనాల పార్కింగ్ సామర్థ్యం పూర్తికావడంతో మంగళవారం సాయంత్రం 4.35 నిమిషాలకు ఘాట్ రోడ్డులో సొంత వాహనాలను కూడా నిలిపివేశారు. వాహన పాసులు ఉన్న వారికి మాత్రమే అనుమతించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు వెంకట నారాయణ, రామకృష్ణాచ్చారి, అలిపిరి, తిరుపతి పడమర సీఐలు రామ్‌కిషోర్, రామకృష్ణల అలిపిరి టోల్‌గేట్ వద్ద పర్యవేక్షించారు. వాహన పాసులు లేకుండా గరుడ సర్కిల్ వద్దకు వచ్చిన పలువురు ప్రముఖులు, అధికారుల వాహనాలను వెనక్కు పంపారు. దూర ప్రాంతాల నుంచి బస్సులు, వాహనాలలో వచ్చిన భక్తులు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలను ఉంచి అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో తిరుమల వెళ్లారు. దేవలోక్, భారతీయ విద్యాభవన్, ఎస్వీసీ ఇంజినీరింగ్ కళాశాల, ఇస్కాన్, బాలాజీ బస్టాండు, నెహ్రూ మున్సిపల్ పాఠశాల మైదానంలో వాహనాలను పార్కింగ్ చేసి తిరుమలకు వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం లోపే పెద్ద సంఖ్యలో భక్తులు, వాహనాలు తిరుమల చేరుకున్నాయి. సాయంత్రం 4.35 తర్వాత ఆర్టీసీ బస్సుల్లో భక్తులు తిరుమల వెళ్లారు.

అలరించిన భక్తి సంగీత కార్యక్రమాలు



శ్రీవారి ఆలయం ఎదుట ఎండవేడిమికి చీరలు కప్పుకొని, గొడుగులు పట్టుకుని రక్షణ పొందుతున్న భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో మంగళవారం తిరుమల నాదనీరాజనం, ఆస్థాన మండపంలో తితిదే హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గరుడసేవ రోజున భారతీయ విద్యాభవన్ బృందం శ్రీ లక్ష్మీ, విష్ణుసహస్రనామ పారాయణం, గోవిందనామాలు, నామసంకీర్తన భజనలు నిర్వహించారు. ఆర్.వాణిశ్రీ, ఓవి జలజాక్షి, కళానాగరాజ్, పి.విద్యాలత, ఎస్.సుధ తదితరులు పాల్గొన్నారు.



తిరుమలలో శ్రీవారి ఆలయం ఎదుట గరుడ వాహన సేవ వీక్షిస్తున్న భక్తజనం

కిక్కిరిసిన శ్రీవారిమెట్టు



మెట్టు మార్గంలో భక్తజనం

చంద్రగిరి, న్యూస్‌టుడే: గరుడ సేవను వీక్షించడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక నుంచి తరలివచ్చిన భక్తులతో శ్రీవారిమెట్టు మార్గం కిక్కిరిసిపోయింది. మెట్టు మార్గంలో తరలివెళ్లిన భక్తులకు పాదాల మండపం వద్ద గోవిందసేవా మండలి ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం ఏర్పాటు చేసింది. నిర్వాహకులు శ్రీనివాసులునాయుడుస్వామి మాట్లాడుతూ.. 13 సంవత్సరాలుగా బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తున్నామన్నారు.

నేను సైతం.. భక్తులకు పహారా



వైల్డ్ అనిమల్ సెన్సార్‌తో అటవీ కార్మికుడు

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాలకు పాదయాత్రతో మెట్ల మార్గంలో తరలివచ్చే భక్తులకు రక్షణగా తితిదే అటవీశాఖ ఆధ్వర్యంలో వైల్డ్ అనిమల్ సెన్సార్లు, షాక్ పరికరాలను సిబ్బందికి సమకూర్చింది. మంగళవారం గరుడసేవ సందర్భంగా శ్రీవారిమెట్టు, అలిపిరి నడక మార్గాల్లో అటవీ కార్మికులు సెన్సార్లతో రక్షణ చర్యల్లో పాల్గొన్నారు. ఈ పరికరం 10 అడుగుల దూరంలో ఏదైనా వన్యప్రాణికానీ, చిరుతలు, ఎలుగు బంట్లు ఉన్నా గుర్తిస్తుంది. తద్వారా పరికరాన్ని నిర్వహించే కార్మికుడు సైరన్ మోగించి, వన్యప్రాణులను భయపెట్టే ప్రయత్నం చేస్తాడు. సమీపంలో ఉండే తోటి కార్మికులను అలర్ట్ చేస్తారు. పరికరం చివర భాగంతో పది అడుగుల దూరం నుంచే వన్యప్రాణికి షాక్ కొట్టించి, అక్కడి నుంచి పారిపోయేలా చేయవచ్చు.



ఉగ్రరూపిణీ.. వ్యాఘ్రాసుర సంహారిణి

వ్యాఘ్రాసురుని సంహరించేందుకు జ్ఞానాంబిక ఉగ్రరూపిణిగా దర్శనమిచ్చారు. దేవీ నవరాత్రి వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం వ్యాఘ్రాసుర సంహారంతో అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టారు. ముక్కంటి ఆలయం నుంచి బాల జ్ఞానాంబికను ఆలయం వద్దకు తీసుకువచ్చి ధూప, దీప, నివేదనలు సమర్పించారు.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

దత్తత.. నిబద్ధత

గ్రామీణుల్లో సాంకేతిక చైతన్యం



ఎన్‌ఎస్‌ఎస్ పిల్లలతో ఐఐటీ విద్యార్థులు

శ్రీకాళహస్తి, ఏర్పేడు, న్యూస్‌టుడే: సాంకేతిక విద్యను అభ్యసిస్తు సమీపంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు దానిపై అవగాహన కల్పిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఏర్పేడులోని తిరుపతి ఐఐటీ విద్యార్థులు. జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) ద్వారా అక్కడి విద్యార్థులు, గ్రామీణులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దే విధంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నారు. ఐఐటీ విద్యా సంస్థలకు సమీపంలోని పంగూరు, పాగాలి, శ్రీనివాసపురం, రాజులపాలెం, నర్సనేరి, నాగంపల్లి, ఇనుమురుగు గ్రామాలను దత్తత తీసుకుని అక్కడి గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్యను పరిచయం చేయడంతో పాటు సృజనాత్మకతతో వాక్ చేసే పరిశోధనలు చేయించి అద్భుతమైన ఆవిష్కరణలతో అందరి మన్నలు పొందుతున్నారు.

మరింత విస్తరించాలి



గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి పథంలో నడిచేది. ఆయా గ్రామాల్లో సాంకేతిక విద్య విస్తరింపజేయాల్సి ఉంది. పరిసరాల పరిశుభ్రత గురించి గ్రామీణ ప్రజలు ఎంతో శ్రద్ధగా విని వాటిని ఆదరించడం తమకెంతో ఆనందాన్ని ఇస్తోంది.

– శ్రావ్య, ఐఐటీ విద్యార్థిని

చైతన్యం.. కర్తవ్యం



గ్రామాలు దత్తత తీసుకోవడం, అక్కడి వాళ్ల సమస్యలు తెలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయా గ్రామాల్లో తిరుగుతూ వాళ్లను చైతన్య వంతులను చేయడం తమ వంతు కర్తవ్యం. సెలవుల్లో ఈ తరహా కార్యక్రమాలు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది.

– రూపేష్, ఐఐటీ విద్యార్థి

యువత.. సామాజిక బాధ్యత

చదువుతో పాటు సామాజిక సేవాతత్పరత లక్ష్యంగా విద్యార్థులు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రధానంగా ఎన్‌ఎస్‌ఎస్ పేరుతో ఆయా గ్రామాల్లో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం విశేషం. ● గ్రామీణ పాఠశాలల్లోని విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించడం. సృజనాత్మక పరిశోధనలను ప్రోత్సహించడం. ● ఆసక్తితో పాటు నైపుణ్యం ప్రదర్శించే విద్యార్థులను మరింతగా ప్రోత్సహించి వారిలోని మేధాశక్తిని వెలికితీయడం. ● పేదల ఇళ్లకు వెళ్లడం. వాళ్ల దినచర్య కూలికెళ్లి కుటుంబాలను పోషించుకోవడం తదితర అంశాలను తెలియజేస్తున్నారు. ● సాంకేతిక పరిజ్ఞాన వ్యవసాయం గురించి తెలియజేయడం, ఆధునిక యాంత్రీకరణ, డ్రోన్ ద్వారా తెగుళ్ల నివారణ పురుగు మందుల పిచికారీ తదితర విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ● స్వచ్ఛభారత్ కార్యక్రమాలతో గ్రామీణుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు శ్రమిస్తున్నారు. పరిసరాలు అధ్వానంగా ఉంటే తలెత్తే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా పరిశుభ్రత విషయంలో ప్రజల భాగస్వామ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం విశేషం.

గ్రామీణ ప్రజలకు దగ్గరయ్యేలా..



చదువుతో పాటు సామాజిక బాధ్యతను విద్యార్థులకు అలవాటు చేస్తున్నాం. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రజలకు దగ్గరయ్యేందుకు చక్కటి అవకాశం. పల్లె వాతావరణం, పరిసరాలు, అక్కడి ప్రజల జీవన స్థితులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– మహేష్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి, ఐఐటీ

ఎస్వీయూలో 1,215 మందికి పీజీ ప్రవేశాలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ పరిధిలో రెండో విడత పీజీ ప్రవేశాలు అక్టోబర్ 4 నుంచి 7 వరకు జరిగాయని, విశ్వవిద్యాలయంలో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీసెట్ 2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ధ్రువపత్రాలు పరిశీలించారు. మొత్తం 2,080 సీట్లు ఉండగా 1,215 మంది చేరినట్లు వెల్లడించారు. ఆర్ట్స్ 267, సైన్స్ 576, కామర్స్ 108, మేనేజ్‌మెంట్ 132, ఎంసీఏ విభాగంలో 132 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని, 59 శాతం మంది చేరినట్లు వర్సిటీ డీవోఏ డైరెక్టర్ ఆచార్య రమేష్‌బాబు వెల్లడించారు.

మద్యం దరఖాస్తుల రాబడి రూ.30 కోట్లు

తిరుపతి(నేరవిభాగం): మద్యం దుకాణాల దరఖాస్తుల దాఖలుతో ప్రభుత్వానికి రూ.30 కోట్ల రాబడి అందింది. మరో రోజు ఉండగానే జిల్లాలోని అన్ని దుకాణాలకు దరఖాస్తుల దాఖలయ్యాయి. 8వ తేదీ సాయంత్రం 8 గంటలకు 1520 దరఖాస్తులు అందాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం.. ప్రభుత్వ మద్యం దుకాణ విధానానికి స్వస్తిపలికి ప్రైవేటు మద్యం పాలసీకి శ్రీకారం చుట్టింది. ఆ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసి ఈ నెల 1వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. 9వ తేదీ వరకు గడువు ఉండటంతో రెండు రోజులుగా దరఖాస్తుల జోరు పెరిగింది. గడువు ముగిసే సమయానికి 227 దుకాణాలకు సుమారు మూడు వేల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. గూడూరు డివిజన్‌లో దరఖాస్తులకు స్పందన రావడంలేదు. ఆ ప్రాంతంలో దరఖాస్తుదారులు ఒత్తిడికి గురవుతున్నారనే ఆరోపణలున్నాయి.

ధనలక్ష్మీ.. ధగధగలు



పది లక్షల రూపాయల విలువైన కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీ అలంకరణలో కన్యకా పరమేశ్వరి దర్శనమిచ్చారు. తిరుపతి నగరంలోని కొత్తవీధిలోని అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని అలంకరించారు.

– న్యూస్‌టుడే, తిరుపతి(బైరాగిపట్టెడ)

కాణిపాకం గణపయ్య తరఫున సారె సమర్పణ



సారె తీసుకువస్తున్న ఆలయ ఈవో గురుప్రసాద్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, సీపీ రాజశేఖర్‌బాబు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలను పురస్కరించుకొని జగన్మాత దుర్గమ్మకు కాణిపాకం వినాయక దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు, సారెను మంగళవారం సమర్పించారు. ఈవో గురుప్రసాద్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు మేళతాళాల నడుమ సారెను ఈవో రామారావు, వైదిక కమిటీ సభ్యులకు అందజేశారు. తొలుత వారికి దుర్గగుడి ఏసీ సాంబశివరావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కోట, న్యూస్‌టుడే: జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ క్రీడామైదానంలో మంగళవారం ఖోఖో క్రీడాకారుల ఎంపిక శిబిరాన్ని యూనివర్సిటీ పరిశీలకులు జోజిరెడ్డి, ఎంపిక కమిటీ సభ్యులు సుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పురుషుల విభాగంలో పలు కళాశాలల నుంచి వచ్చిన 75 మందిలో 15 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరిలో ఎన్‌బీకేఆర్ ఐఎస్టీకి చెందిన శ్రవణ్‌కుమార్, అలెక్స్ కూడా ఉన్నారు. వీరు డిసెంబరులో కాలికట్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. మహిళా విభాగంలో 60 మంది క్రీడాకారులు పాల్గొనగా 15 మంది ఎంపికయ్యారు. అందులో ఎన్‌బీకేఆర్‌కు చెందిన నాగేశ్వరి, గాయత్రీ ఉన్నారు. వీరు డిసెంబరులో చెన్నైలోని సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని కళాశాల పీడీ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఖోఖో కోచ్ ఆంజనేయకుమార్, కళాశాల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి, వ్యాయామ అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బొమ్మల కొలువు.. చూడముచ్చటగా..!



దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక బండ్లవీధికి చెందిన రెడ్డప్పగారి తిప్పారెడ్డి కుటుంబ సభ్యులు తమ నివాసంలో బొమ్మల కొలువును చూడముచ్చటగా తీర్చిదిద్దారు. తొమ్మిది మెట్లను ఏర్పాటు చేశారు. శ్రీ మహావిష్ణువు దశావతారాలు, అష్టలక్ష్ములు, కృష్ణ లీలలు, త్రిమూర్తులు, శ్రీరామ కుటుంబం, శివ కుటుంబం, కృష్ణ బృందావనం, కుచేల స్నేహం, రామాయణ ఘట్టాలను కళ్లకు కట్టినట్లు పొందుపర్చారు. గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వంటి దేశ నాయకుల బొమ్మలు ప్రదర్శించారు. మన సంప్రదాయాలు, వారసత్వ విలువలను భవిష్యత్తుతరాలకు తెలియజెప్పే వ్యవహారమే ఈ బొమ్మల కొలువని నిర్వాహకులు తెలిపారు.

– న్యూస్‌టుడే, తిరుపతి (బైరాగిపట్టెడ)

క్రీడారంగంలో విప్లవాత్మక మార్పులు

● శాప్ ఛైర్మన్ రవి నాయుడు



కలెక్టర్‌ను సత్కరిస్తున్న శాప్ ఛైర్మన్ రవి నాయుడు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: క్రీడారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తామని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మంగళవారం కలిసి శాలువాతో సత్కరించారు. జిల్లాలో శాప్‌కు 38 ఎకరాల భూమి అవసరమని, శ్రీనివాస క్రీడా సముదాయం అభివృద్ధికి స్మార్ట్ సిటీ నిధులు కేటాయించాలని కోరారు. తెదేపా తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్, నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, తెలుగు యువత అధికార ప్రతినిధి వాసు, తెలుగు యువత రాష్ట్ర నాయకులు రంజిత్ నాయుడు, శ్రీరాం బాబీ, సునీల్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తులకు గడువు పొడిగింపు

తిరుపతి (బైరాగిపట్టెడ): డిసెంబరు 8న జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) దరఖాస్తుల సమర్పణకు ఈనెల 15 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రింటెడ్ నామినల్ రోల్స్, ఒరిజినల్ ఎస్‌బీఐ రసీదును సంబంధిత జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ఈనెల 17వ తేదీగా సమర్పించాలని సూచించారు.



సదస్సుకు వచ్చిన అతిథులను సన్మానిస్తున్న నాగరాజు రామారావు

ఎంబీయూలో అంతర్జాతీయ సమావేశం

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో కమ్యూనికేషన్, కంప్యూటర్ టెక్నాలజీస్-2024పై ఆరో అంతర్జాతీయ సమావేశం రెండు రోజుల పాటు నిర్వహించారు. ప్రముఖ పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రామికవేత్తలను ఈ కార్యక్రమం ఆకర్షించిందని వైస్ ఛాన్స్‌లర్ నాగరాజు రామారావు మంగళవారం పేర్కొన్నారు. ఇందులో అభివృద్ధి చెందుతున్న సాంకేతికత పురోగతిపై చర్చించారు. ఎంబీయూ చీఫ్ గ్రోత్ అధికారి వికాససింగ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి పాల్గొన్నారు.

పరీక్షా ఫలితాల విడుదల

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో ఆగస్టులో నిర్వహించిన బీఈడీ (స్పెషల్) కోర్సు మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్షా ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు పరీక్షల కార్యాలయం అధికారులు తెలిపారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

వెంకాబ్ కోళ్ల ధరలు	
బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	241
లేయర్ మాంసం	187

ఆడుకునేందుకు వెళ్లి.. శవమై తేలి



లాసిక్ (పాతచిత్రం)

చిల్లకూరు, న్యూస్‌టుడే: ఇంటి నుంచి సరదాగా ఆడుకునేందుకు వెళ్లిన బాలుడు కాల్వలో శవమై తేలిన హృదయ విదారక ఘటన మండలంలోని వరగలి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు.. స్థానిక ఎస్సీ కాలనీలో నివాసముంటున్న కాతారి సంధ్య, రమేష్ దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం. పెద్దవాడైన లాసిక్ (11) వాకాడులోని గురుకులంలో ఆరో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విచారణ చేపట్టారు. నెలూరు జిల్లా వెంకటాచలం మండలం తిరుమలమ్మపాలెం సమీపంలోని నక్కలకాల్వ ఒడ్డున లాసిక్ మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. మృతుని శరీరంపై గాయాలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరులోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పథకం ప్రకారమే హత్య

ఇద్దరి నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర

ఏర్పేడు, న్యూస్‌టుడే: పథకం ప్రకారమే రేణిగుంట మండలంలోని అత్తూరు పంచాయతీ మొలగమూడి ఎస్సీకాలనీకి చెందిన ప్రవీణ్ (35) హత్యకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. డీఎస్పీ శ్రీనివాసరావు కథనం మేరకు.. ఈ నెల 5న ఏర్పేడు మండలం రావిళ్లవారికండ్రిగ పంచాయతీ ఇరుగలప్పచలం ఆలయానికి సమీపంలో మామిడితోటలో ప్రవీణ్ మృతదేహం లభ్యం కావడంతో హత్యకేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా పెనగడ్డం ఎస్సీకాలనీకి చెందిన దినేష్‌కుమార్, ప్రవీణ్ బంధువులు. ఇరు కుటుంబాల మధ్య మనస్పర్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇద్దరు కలిసి మద్యం తాగినప్పుడల్లా ప్రవీణ్ సూటిపోటి మాటలతో దినేష్‌కుమార్‌ను ఇబ్బంది పెట్టేవాడు. ఈ విషయాన్ని దినేష్ తన స్నేహితుడైన రేణిగుంట మండలం పద్మావతినగర్‌కు చెందిన లోకేష్‌తో చర్చించాడు. దీంతో ఇద్దరు కలిసి ప్రవీణ్‌ను హత్య చేయాలని పథకం వేశారు. అందరం కలిసి మద్యం తాగుదామని ప్రవీణ్‌కు ఫోన్‌చేసి నమ్మించారు. ఈనెల 4వ తేదీన పాపానాయుడుపేటకు పిలిపించుకుని మద్యం తాగేందుకు ఇరుకలప్పచలం ఆలయానికి సమీపంలోని మామిడితోటకు తీసుకెళ్లారు. వారి వెంట తెచ్చుకున్న మచ్చుకత్తితో ప్రవీణ్‌ను విచక్షణారహితంగా నరికి చంపారు. ప్రవీణ్ ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌తో పాటు వారి వెంట తెచ్చుకున్న మచ్చుకత్తిని రహస్య ప్రదేశంలో ఉంచి పరారయ్యారని డీఎస్పీ వివరించారు. మృతుడు ప్రవీణ్‌పై తిరుపతిలో రౌడీషీట్లు ఉండగా.. దినేష్‌కుమార్‌పై ఇప్పటికే గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు ఉందని పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సీఐ జయచంద్ర, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

తిరుపతి

•తిరుపతి •చంద్రగిరి

సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి ఎస్‌ఎస్‌డీ టోకెన్లు లేకుండా మంగళవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌-2లోని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయి బాటగంగమ్మ ఆలయం వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి దాదాపు 24 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌-1లోని ఐదు కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. వీరికి మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. సోమవారం శ్రీవారిని 81,481 మంది భక్తులు దర్శించుకోగా రూ.3.31 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

2,443 మంది హాజరు

తిరుపతి (బైరాగిపట్టెడ): జిల్లా వ్యాప్తంగా మంగళవారం నాలుగు కేంద్రాల్లో టెట్ జరిగింది. ఉదయం 1,337 మందికి గాను 1,217 మంది, మధ్యాహ్నం 1,337 మందికిగాను 1,226 మంది హాజరయ్యారు.

ఎక్సైజ్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

చంద్రగిరి: నూతన మద్యం విధానాన్ని పారదర్శకంగా అమలు చేయడంలో భాగంగా చంద్రగిరి ఎక్సైజ్ కార్యాలయాన్ని మంగళవారం చిత్తూరు జిల్లా ఎక్సైజ్ ఉప కమిషనర్ విజయశేఖర్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. మొత్తం 17 ప్రైవేట్ మద్యం దుకాణాల ఏర్పాటుకు 57 దరఖాస్తులు అందాయని సీఐ [illegible] అధికారులకు వివరించారు. తిరుపతి జిల్లా ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి, చంద్రగిరి ఎక్సైజ్ శాఖ ఎస్సైలు సుధాకర్‌రావు, గిరి పాల్గొన్నారు.

శరణాగతి.. గరుడా చలపతి



శ్రీవారి గరుడసేవలో భక్తజన వాహిని సునామీలా సాక్షాత్కరించింది. ఆపద మొక్కులవాణ్ణి దర్శించేందుకు కొండకు వరుసకట్టారు. గోవింద నామస్మరణంతో ఆ వైకుంఠుని క్షేత్రం పులకించింది. అలిపిరి పాదాల మండపం మొదలు తిరుమల శేషాచలం వరకు భక్తుల తాకిడి కనిపించింది. రెండు రోజులుగా ఆ గోవిందునిపైనే మనసును లగ్నం చేసి గరుడ సేవను కనులారా వీక్షించి తన్మయం చెందారు.

\- న్యూస్‌టుడే, తిరుమల, తిరుపతి (బైరాగిపట్టెడ)



తిరుమల: గరుడసేవలో పాల్గొన్న పెద్దజీయర్, చిన్నజీయర్ తదితరులు











మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే:

సమస్య: బాలాజీ కాలనీలోని పోలీస్ క్వార్టర్స్ సమీపంలో ఉన్న మాళ్వాడీ మున్సిపల్ హైస్కూల్ వద్ద మూడు నెలలుగా యూజీడీ మ్యాన్‌హోల్ పొంగుతోంది. దుర్వాసనతోపాటు పరిసరాలు మురుగుమయంగా మారాయి.
– ఎం.మల్లికార్జున, హమీద్‌నగర్

సమాధానం: ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించి సమస్య పరిష్కరిస్తాం.
– డా.అన్వేష్‌రెడ్డి, వైద్యాధికారి, నగరపాలిక

మానసిక సమస్యల్లో మహిళలే అధికం

మహిళా వర్సిటీ(తిరుపతి): భారతదేశంలో మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిలో మహిళలే అధికమని స్విమ్స్ సైకియాట్రీ విభాగాధిపతి గణేశ్ కుమార్ పేర్కొన్నారు. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం, సైకాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం 'మానసిక ఆరోగ్య దినోత్సవం' నిర్వహించారు. హ్యుమానిటీస్ బ్లాక్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్ని సమస్యలు వచ్చినా ఒత్తిడికి గురి కాకూడదన్నారు. మానసిక సమస్యలకు దూరంగా ఉన్నప్పుడే సంతోషకర జీవితాన్ని గడపవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఉమెన్ స్టడీస్ సెంటర్ సంచాలకురాలు ఆచార్య సి.వాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి మండల పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ వాసురెడ్డి మంగళవారం తెలిపారు. ఈ అసౌకర్యాన్ని గమనించి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

వినియోగదారులకు ఈకేవైసీ చేయించాలి

పాకాల, న్యూస్‌టుడే: మండలంలోని గ్యాస్ వినియోగదారులకు ఉచితంగా ఈకేవైసీ చేయించాలని గాంధీనగర్‌కు చెందిన వినియోగదారుల పరిరక్షణ సమితి ప్రతినిధులు జనార్దననాయుడు, మునిప్రభాకర్, కలికిరి నారాయణస్వామి తహసీల్దారు నిత్యానందబాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

స్వయం ఉపాధికి ఉచిత శిక్షణ

చంద్రగిరి, న్యూస్‌టుడే: స్థానిక యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 'బ్యూటీ పార్లర్' కోర్సుపై మహిళలకు 30 రోజులపాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సంస్థ డైరెక్టర్ పి.సురేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి తరగతులు ఉంటాయన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పదో తరగతి చదివిన 19-45 సంవత్సరాల మహిళలు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 79896 80587, 94949 51289, 83091 64644 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చట్టాల మార్పుతో పనిభారం

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల మార్పుతో కార్మికులపై పనిభారం మోపుతోందని ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రామకృష్ణ పేర్కొన్నారు. యూనియన్ 58వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక సుందరయ్య నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మిక చట్టాల మార్పును వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు.

బయట ఉన్న భక్తులకు దర్శనం

తిరుమల, న్యూస్‌టుడే: గరుడవాహన సేవలో బయట వాహనసేవను చూసేందుకు వేచి ఉన్న భక్తులకు తితిదే అధికారులు, పోలీసులు సమన్వయంతో రాత్రి మంచి దర్శనం కల్పించారు. గరుడ వాహనం తూర్పు మాడ వీధి దాటిన తర్వాత అప్పటి వరకు గ్యాలరీల్లో ఉన్న భక్తులను వెలుపలికి పంపించారు. ఈ స్థానంలో కొత్తగా మళ్లీ వెలుపల ఉన్న భక్తులతో నింపారు. అనంతరం సుపథం, మ్యూజియం, మేదరమెట్టు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రం వైపు నుంచి మాడ వీధుల్లో వాహనానికి ఇరువైపులా తాళ్లతో మార్గాన్ని ఏర్పాటు భక్తులకు వేగంగా దర్శనం కల్పించారు. మ్యూజియం వద్ద పెద్దయెత్తున బయట ఉన్న భక్తులకు శ్రీవారి వాహనసేవ దర్శనం లభించింది.



కనుల పండువగా..

తిరుపతి (గ్రామీణ): తుమ్మలగుంటలోని స్వామివారి ఆలయంలో గరుడ వాహనసేవ కనుల పండువగా సాగింది. ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పరిసర గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని యల్లమంద, ఉస్తికాయలపెంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు మంగళవారం సంయుక్తంగా నిర్వహించారు. రైతులు సాగు చేసిన పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతుల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ఖాదర్‌బాషా, ఉద్యానవన శాఖ అధికారిణి శివకుమారి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: డ్రిప్ పరికరాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు పేర్కొన్నారు. తిరుపతి గ్రామీణ మండలం గొల్లపల్లిలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి 'పొలం పిలుస్తోంది' ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని మెలకువలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు మనోహర్‌బాబు, వ్యవసాయాధికారి మమత, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు సిబ్బంది

నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: పార్టీ నాయకులు ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తిరుపతి, చిత్తూరు జిల్లాల వైకాపా అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. తిరుపతి నగరంలోని ఓ హోటల్‌లో రెండు జిల్లాలకు సంబంధించిన ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యాచరణను ఆయన వివరించారు. నియోజకవర్గాల్లో కేడర్ చెక్కు చెదరకుండా కాపాడుకోవాలని, ఐదేళ్లపాటు పార్టీ కోసం పనిచేసేలా కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ సమన్వయకర్తలు మాజీ ఎంపీ రెడ్డెప్ప, కృపాలక్ష్మీ, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

నవరాత్రుల వైభవం చూతమురారండి..!

నవరాత్రుల వైభవోత్సవాలు వాడవాడలా ఘనంగా జరుగుతున్నాయి. దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గరుడవాహనంపై నారాయణి స్వరూపంతో శ్రీమిట్టగంగమ్మతల్లి, సరస్వతీదేవి స్వరూపంతో హంసవాహనంపై మూలస్థాన ఎల్లమ్మతల్లి పట్టణ పురవీధుల్లో విహరించారు.

\- న్యూస్‌టుడే బృందం



చంద్రగిరి: శ్రీనారాయణిగా గరుడ వాహనంపై శ్రీమిట్టగంగమ్మ తల్లి



రామచంద్రాపురం: శ్రీలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న శ్రీదుర్గాదేవి అమ్మవారు



పాకాల: నేంద్రగుంటలో శ్రీమహాలక్ష్మిగా మూలస్థానమ్మ



తిరుపతి(జీవకోన): విశాలాక్షి అమ్మవారిగా..



తిరుపతి (గ్రామీణ): లక్ష్మీదేవిగా చెంచులక్ష్మికాలనీలోని మూలస్థాన ఎల్లమ్మ



గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఎండీ సంతోషరావు

స్మార్ట్ మీటర్లపై అవగాహన

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్ల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు పేర్కొన్నారు. మంగళవారం తిరుపతిలోని విద్యుత్తు భవనంలో అవగాహన పత్రాలను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాణిజ్య, పారిశ్రామిక సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అయూబ్‌ఖాన్, లక్ష్మీనరసయ్య, జీయం చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ వేణుగోపాలరావు, డీఈఈ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రేణిగుంట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రేణిగుంట పట్టణ పోలీసుల కథనం మేరకు... రైల్వే కోడూరుకు చెందిన బలరామరాజు(55) సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో రేణిగుంట వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బలరామరాజును చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం రేణిగుంట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హరియాణాలో భాజపా విజయంపై సంబరాలు

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: హరియాణాలో భాజపా వరుసగా మూడుసార్లు విజయం సాధించడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ తిరుపతిలో మంగళవారం సంబరాలు చేసుకున్నారు. భాజపా సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, కట్టమంచి చంద్రబాబు యాదవ్, తూర్పు మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న భాజపా నాయకులు

భక్తురాలికి నగదు అప్పగింత

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ విజిలెన్స్ సిబ్బంది తమకు దొరికిన పర్సును భక్తురాలికి అప్పగించి తమ నిజాయితీని చాటుకున్నారు. మంగళవారం మధ్యప్రదేశ్‌కు చెందిన సరస్వతి ఠాకూర్ తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి దర్శనార్థం వచ్చారు. దర్శనానికి వెళ్లే సమయంలో సెక్యూరిటీ చెక్ పాయింట్ వద్ద పర్సును మరిచిపోయారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న విజిలెన్స్ సిబ్బంది గోవిందయ్య దానిని గుర్తించి ఏవీఐ బ్రహ్మానందరాజుకు అప్పగించారు. విషయం మైకుల్లో ప్రచారం చేసి అందజేశారు. రూ.16 వేలు నగదు, బంగారు వాచ్, రెండు ఉంగరాలు ఉన్నట్టు భక్తురాలు తెలిపారు.

అమ్మవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

బాధ్యతల స్వీకరణ

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని తుమ్మలగుంట పంచాయతీ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక తెదేపా నాయకులు బిరుదాల తులసీరాం రెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

బొత్సకు సన్మానం

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్‌రెడ్డిని ఆ పార్టీ సీనియర్ నేతలు కారుమూర్తి వెంకటనాగేశ్వరరావు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మంగళవారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురినీ కరుణాకర్‌రెడ్డి సత్కరించారు.

అర్చన విధానంపై తొమ్మిదిరోజుల కార్యశాల

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతిలోని జాతీయ సంస్కృత విద్యాపీఠంలో ఈనెల 16 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్ పద్ధతిలో వైఖానస ఆగమ అర్చన విధానంపై కార్యశాల నిర్వహిస్తున్నట్లు ఆచార్య విష్ణు భట్టాచార్యులు ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కొప్పెర ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొప్పెర ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు ఫౌండర్ కె.సాయిసురేష్, ట్రస్టీ కె.రుక్మిణమ్మ, చంద్రమోహన్, లలిత, రమేష్, రెడ్డిశేఖర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

జీవిత సారాంశం భగవద్గీతలో ఉంది

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: ఆదర్శవంతమైన జీవితం గడపడానికి కావలసిన జ్ఞానమంతా భగవద్గీతలోనే ఉందని తితిదే ధర్మప్రచార పరిషత్ కార్యనిర్వహణాధికారి డాక్టర్ పగడాల నారాయణ పేర్కొన్నారు. విశ్రాంత వీసీ ఆచార్య కూతాటి వెంకటరెడ్డి రచించిన 'కర్తవ్యబోధ గీత' పుస్తకాన్ని ఎస్వీనగర్‌లోని ఆయన నివాసంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... యువతరం ఆధునిక జ్ఞానంతోపాటు, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. పద్మావతీ మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. మానవ జన్మ సార్థకం చేసుకోడానికి గీతా బోధనలు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో సభాధ్యక్షుడు రొటేరియన్ డాక్టర్ కోరా వెంకటాచలపతి, విశ్రాంత వీసీ వెంకటరెడ్డి, తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాగం నాగరాజు, ప్రసార భారతి విశ్రాంత ఈవో డాక్టర్ కె.విజయ తదితరులు పాల్గొన్నారు.

కశ్మీర్‌లో గెలుపుపై..

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: జమ్మూకశ్మీర్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించడంపై తిరుపతిలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. స్థానిక రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

ఆర్డీవో బాధ్యతల స్వీకరణ



శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి ఆర్డీవోగా భానుప్రకాష్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నూతన ఆర్డీవోకు మంగళవారం స్థానిక కార్యాలయ ఏవోతో పాటు పలువురు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ జిల్లా అమలాపురం స్వస్థలమని, డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పొందినట్లు తెలిపారు. ఆర్డీవోగా తొలి పోస్టింగ్ ఇక్కడి పుణ్యక్షేత్రంలో తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎక్కువ ప్రాధాన్యం కల్పించనున్నట్లు వివరించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందనలు

శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సురేష్ ఇటీవల జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడంతో విద్యాశాఖ కమిషనర్ వెంకట గజపతిరాజు అభినందించారు. మంగళవారం కమిషనర్‌ను కలిసిన సురేష్ జాతీయ అవార్డు గురించి వివరించారు. రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకోవడం అభినందనీయమని కమిషనర్ ప్రశంసించారు. ఇదే రీతిలో మరింత ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు.



సురేష్‌ను అభినందిస్తున్న విద్యాశాఖ కమిషనర్ వెంకట గజపతిరాజు



అన్నదానం చేస్తున్న కోలా ఆనంద్, దుర్గాప్రసాద్ కుటుంబీకులు

దుర్గాప్రసాద్ సేవలు నిరుపమానం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సామాజిక సేవలో తనవంతు బాధ్యతగా పిళ్లారి దుర్గాప్రసాద్ చేసిన సేవలు నిరుపమానమని భాజపా రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. బజారువీధిలోని పిళ్లారి ఫౌండేషన్ కార్యాలయ ఆవరణలో దుర్గాప్రసాద్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం వారి కుటుంబీకులు అన్నదానం చేశారు. ఈశ్వర్‌స్వామి, ఫౌండేషన్ నిర్వాహకులు అమరావతి, టోని, నేతాజీ, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే సంగతి



కాల్వలో దిగబడ్డ కారును బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనార్థం వచ్చి పార్కింగ్‌లో వాహనాలు నిలుపుదల చేసే భక్తులకు సరైన సూచికలు లేక పోవడంతో అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రధానంగా సన్నిధివీధిలోని పార్కింగ్ ప్రదేశంలో మురుగు నీరు వెళ్లేందుకు వీలుగా కాల్వలు ఏర్పాటు

కాల్వలోకి ఒరిగిపోతున్న వాహనాలు

చేశారు. రద్దీ సమయంలో వాహనాలు ఎక్కువగా పార్కింగ్ చేయడం కారణంగా పక్కపక్కనే ఉంచాల్సి వస్తోంది. అయితే వాహనాలు తీసుకునే సమయంలో పలు దఫాలు వాహనాలు పక్కనున్న కాల్వలోకి ఒరిగిపోతున్నాయి. ఒరిగి పోయిన వాహనాలను బయటకు తీసుకునేందుకు భక్తులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

సూచికల ఏర్పాటు అవసరం

కాల్వలోకి ఎక్కువగా వాహనాలు ఒరిగిపోయేందుకు కారణం ఒక్కో చోట ఒక్కో రీతిలో కాల్వ కన్పిస్తుంది. పార్కింగ్ ప్రదేశాన్ని ఆనుకుని ఉన్న కాల్వలో తరచూ వాహనాలు ఒరిగిపోతున్నాయి. అలా కాకుండా ఉండేలా కాల్వ వెంబడి సూచికలు ఏర్పాటు చేయడం, వీలైతే ఇనుప డివైడర్లు ఉంచినా ఇబ్బందులు తప్పించే అవకాశం ఉంటుంది. ఖరీదైన వాహనాలు ఇలా కాల్వలోకి ఒరిగిపోవడం, వ్యయ, ప్రయాసలతో వీటిని బయటకు తీసేందుకు యాత్రికులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతమనే చెప్పాలి. ఇకనైనా ఈ తరహా ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, తొట్టంబేడు

సమస్య: శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. ఆర్టీసీ బస్సులకు తోడు సాయంత్రం వేళల్లో పరిశ్రమల బస్సులు, పాఠశాల, కళాశాల వాహనాలు, ఆటోలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో ఇష్టానుసారం రోడ్లపై నిలుపుదల చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పోలీసులు చర్యలు తీసుకోవాలి.

- పవన్‌కుమార్, స్థానికుడు

సమాధానం: ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రైవేట్ వాహనాలు ఈ ప్రాంతంతో నిలుపుదల చేయకుండా సూచనలిస్తాం. ఆటోలను ఇబ్బడిముబ్బడిగా నిలిపితే చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశులు, శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ

న్యూస్‌టుడే, ఏర్పేడు

సమస్య: మండలంలోని ముసలిపేడు పంచాయతీలో మురుగు కాలువలు అధ్వానంగా ఉండటంతో వ్యర్థపు నీరంతా వీధుల్లో ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి మురుగు కాలువలు శుభ్రంచేసి బ్లీచింగ్ చల్లించాలి.

- బత్తెయ్య, స్థానికుడు

సమాధానం: పంచాయతీ అధికారితో చర్చించి మురుగు కాలువలు శుభ్రం చేయిస్తాం. నీరు నిల్వచేరకుండా తరచూ శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం.

- సౌభాగ్యం, ఎంపీడీవో, ఏర్పేడు

న్యూస్‌టుడే, వరదయ్యపాళెం

సమస్య: వరదయ్యపాళెం పంచాయతీ ఎస్సీకాలనీలో మురుగునీరు వీధుల్లోనే ప్రవహిస్తోంది. వీధులు మురికి కూపాలుగా మారాయి. దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతున్నాయి.

- ఇళయరాజా, స్థానికుడు

సమాధానం: కాలనీలోని వీధుల్లో మురుగునీరు వదలరాదని స్థానికులకు నోటీసులు ఇచ్చాం. వెంటనే మురుగు గుంతల్లో పూడిక తీయిస్తాం.

- బసిరెడ్డి, పంచాయతీకార్యదర్శి



శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలో బొమ్మలకొలువు



శ్రీకాళహస్తి: లక్ష్మీ సమేత రంగనాథస్వామిగా..



వరదయ్యపాళెం: కరెన్సీనోట్ల అలంకరణతో..



ఏర్పేడు: గుడిమల్లంలో.. శ్రీఆనందవల్లీదేవి



ఏర్పేడు: శ్రీమాతాసేవా ఆశ్రమంలో శ్రీరాజరాజేశ్వరీదేవి



నారాయణవనం: కరుమారియమ్మగా అవనాక్షమ్మ



సత్యవేడు: శ్రీసర్వమంగళాదేవి



నాగలాపురం: వావిలి కన్యకాపరమేశ్వరీదేవి

జననీ.. శివగామినీ

శ్రీదేవీ నవరాత్రి వార్షికోత్సవాల సందర్భంగా శక్తి ఆలయాల్లో సందడి నెలకొంది. ఈ విశేషోత్సవాల సందర్భంగా ముక్కంటి ఆలయంలో బొమ్మల కొలువు అమ్మవారు కాత్యాయినీగా, కనకదుర్గ అమ్మవారు మహాలక్ష్మిగా, కృష్ణారెడ్డి మండపంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా కొలువుదీరారు. ముత్యాలమ్మ, పొన్నాలమ్మ, గంగమ్మ, శీతలాంబ, అంకాళమ్మ, చాముండేశ్వరి తదితర ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో సర్వాలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. **- న్యూస్‌టుడే బృందం**



రేణిగుంట: అలంకరణలో అమ్మవారు



తొట్టంబేడు: బంగారమ్మ

కేవీపీకి ఘన స్వాగతం

రేణిగుంట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావుకు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. జిల్లా పర్యటన నిమిత్తం ఆయన మంగళవారం ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆయనకు పీసీసీ ఉపాధ్యక్షులు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహులు, తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురవంబాబు, తిరుపతి నగరపాలక అధ్యక్షులు చిట్టిబాబు తదితరులు స్వాగతం పలికారు.

రక్తహీనత నివారణపై అవగాహన పెంచండి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: గర్భవతులకు రక్తహీనత మెరుగు పరుచుకోవడంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాళహస్తిలోని గజేంద్రనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను రోగులు, వారి కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా గణాంక అధికారి నాగేంద్రకుమార్, ఇన్‌ఛార్జి డీపీవో ప్రకాష్, వైద్యులు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ ఆలయాల్లోనూ బయోమెట్రిక్

స్పందనకు వందనం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాల్లో బయోమెట్రిక్ యంత్రాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశాలు జారీ చేశారు. ముక్కంటి ఆలయంలో ప్రస్తుతం బయోమెట్రిక్ హాజరు అమల్లోకి తీసుకువచ్చారు. 'అవగాహన లేక.. అవస్థలు తప్పక' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆలయ ఈవో చర్యలు చేపట్టారు.

వాణిజ్య పంటలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న వ్యవసాయశాస్త్రవేత్త దివ్య

ఏర్పేడు, న్యూస్‌టుడే: డిమాండ్‌కు అనుగుణంగా రైతులు వాణిజ్య పంటల సాగుపై దృష్టిసారించాలని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డా.దివ్య తెలిపారు. మండలంలోని పాపానాయుడుపేట రాస్ కార్యాలయంలో మంగళవారం రైతు రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. కాలానుగుణంగా శాస్త్రీయ విధానంతో మార్పు చెందిన నూతన వంగడాలతో పంటలు సాగుచేయాలని సూచించారు. వరి, వేరుశెనగ, చెరకు, నూనె గింజలు, మినుములు, ఉలవలు కొత్తరకాలను వివరించారు. అనంతరం 81మంది రైతులకు రూ.45లక్షలు రుణాలు అందజేశారు. కార్యక్రమంలో బాలాజిరెడ్డి, వెంకటకుమార్, మునేంద్ర, పార్థసారధి పాల్గొన్నారు.


ఆధునిక సేద్యంతో అధిక లాభాలు

వరదయ్యపాళెం : ఆధునిక యాజమాన్య పద్ధతులను అవలంభించి అధిక లాభాలు సాధించాలని వ్యవసాయశాఖ ఏడీ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. మండలంలోని కళత్తూరు, సీఎల్ఎన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన మందుల వివరాల గురించి విశదీకరించారు. పశువులకు అవసరమైన టీకాలు వేసి వర్షాకాలంలో వ్యాధుల నుంచి రక్షణ పొందే చర్యల గురించి వివరించారు. ఏవో ద్వారకానాథ్, విస్తరణాధికారి ప్రవీణ్, వ్యవసాయ సహాయకులు పవన్, పద్మ, జ్యోతి పశు వైద్య సిబ్బంది మౌళి, బాలముని, మార్కెట్ కమిటీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రేణిగుంట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రేణిగుంట పట్టణ పోలీసుల కథనం మేరకు... రైల్వే కోడూరుకు చెందిన బలరామరాజు(55) సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో రేణిగుంట వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బలరామరాజును చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం రేణిగుంట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మురుగు తొక్కాల్సిందే.. కాళ్లు కడగాల్సిందే



శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అడుసు తొక్కనేలా.. కాళ్లు కడగనేలా అన్నట్లు.. పట్టణంలోని కైలాసగిరి కాలనీలో టాయ్‌లెట్స్ వ్యర్థాలతో అక్కడి వాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వల్లో మురుగు పేరుకుపోవడం, వ్యర్థాలన్నీ రోడ్లపైకి చేరాయి. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, అక్కడున్న గ్రామదేవత ఆలయానికి వెళ్లే భక్తులు ఈ మురుగును తొక్కుక్కుంటూ కాళ్లు కడుక్కోవాల్సి వస్తోంది. దుర్గంధం, దోమల బెడద కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అధికారులు వ్యర్థాలను తొలగించడంతో పాటు మళ్లీ కాల్వల్లోకి వదలిపెట్టకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వంతెనపై గుంత.. వాహనదారుల చింత



బీఎన్‌కండ్రిగ: మండలంలోని శ్రీకాళహస్తి-తడ రహదారి కాళంగి నదిపై నిర్మించిన వంతెనపై నిర్మించిన సీసీ రహదారి పలు చోట్ల బీటలు వారి గుంతలుగా మారుతున్నాయి. వంతెన అనుకుని మలుపు ఉండటంతో వాహనదారులు గుంతలను గుర్తించ లేక ప్రమాదాలకు గురవుతున్నారు. పలుచోట్ల నిర్మాణ సమయంలో ఉపయోగించిన ఇనుప కమ్మీలు బయటకు వచ్చాయి. గతంలో ఒకసారి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా మరలా గుంతలు ఏర్పాడ్డాయి. వంతెనపై రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో త్రివిక్రమరావు మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

మట్టి కనిపిస్తే మాయం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: మండలంలోని లింగమనాయుడుపల్లి చెరువునుంచి మూడు రోజులుగా కొందరు యథేచ్ఛగా మట్టి తవ్వి తరలిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోనే కాకుండా సమీపంలోని శ్రీకాళహస్తి పట్టణ పరిసరాల్లో అత్యధికంగా లేఅవుట్లు వెలుస్తున్నాయి. వాటికి అవసరమైన గ్రావెల్‌ను ప్రభుత్వ భూములు, చెరువుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకుంటున్నా లెక్కచేయకుండా తవ్వకాలు చేస్తున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో అక్రమ తవ్వకాలు చేస్తున్నారని విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

బీఎన్‌కండ్రిగ: రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీల్లో బీఎన్‌కండ్రిగ మండలం కనమనంబేడు పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువ్యాలీలో సోమవారం నిర్వహించిన ఏకలవ్య గురుకుల పాఠశాలల ఈఎంఆర్ఎస్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 28 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో పోటీపడి ఆరు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులను మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అభినందించినట్లు తెలిపారు.



విద్యార్థులతో ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్

వివాదాస్పద భూమిలో పనులు

అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట మండలం కరకంబాడిలో కోర్టు పరిధిలోని భూమిని కొందరు చదును చేసి మొక్కలు నాటడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కరకంబాడి సర్వే నెంబర్ 153-1లో భూమి, గుట్ట ఉంది. అనేక సంవత్సరాలుగా ప్రభుత్వానికి, ప్రైవేట్ వ్యక్తులకు మధ్య న్యాయ స్థానంలో కేసు నడుస్తోంది. మధ్యలో అప్పుడప్పుడు ఈ భూమిలోకి కొందరు వ్యక్తులు ప్రవేశించడం, స్థానికంగా అడ్డుకోవడం చోటు చేసుకుంటోంది. ఈ క్రమంలో గత రెండు రోజులుగా ఇక్కడ కొందరు వ్యక్తులు జేసీబీతో భూమిని చదును చేసి అక్కడ మొక్కలు నాటారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఇక్కడ పనులను అడ్డుకున్నారు. ఇక్కడ ప్రస్తుతం పనులు చేసే వారిని, తమ భూమి అని న్యాయ స్థానంలో కేసు వేసిన వారిని ఇన్‌ఛార్జి తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి హెచ్చరికలు జారీ చేశారు. ఇలానే కొనసాగితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి పంపారు.



చదును చేసి మొక్కలు నాటిన దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాగలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని కారణి విద్యుత్ సరఫరా కేంద్రం పరిధిలో బుధవారం చెట్లు నరకడం వంటి నిర్వహణ పనులు చేయనున్నట్లు ఏడీ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో బుధవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

విద్యార్థులు.. సమాజ సేవకులు



విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఐఐటీ విద్యార్థులు

ఏర్పేడు, న్యూస్‌టుడే: క్షణం తీరికలేకుండా పుస్తకాలతో కుస్తీపడుతూ అత్యున్నతమైన సాంకేతిక విద్యనభ్యసిస్తున్న ఐఐటీ విద్యార్థులు సమాజ సేవలోనూ యువరాజుల్లా నిలుస్తున్నారు. ఓవైపు విద్యనభ్యసిస్తూనే మరో వైపు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు శ్రీకారం చుట్టారు. పల్లెప్రజలకు జీవనాధారమైన వ్యవసాయం, పేదపిల్లల విద్యాభివృద్ధికి తమ వంతు సాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తుండటంతో పేదల మెచ్చిన ఐఐటీయన్లుగా గుర్తింపు పొందారు.

మౌలిక వసతులు, క్రీడా సామగ్రి ఏర్పాటు

స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించిన ఐఐటీ విద్యార్థులు సమస్యలు గుర్తించి అప్పటికప్పుడే పరిష్కరించారు. ఈ నేపథ్యంలోనే

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు

పల్లం, పంగూరు జడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్నప్పటికీ వారికి అవసరమైన సామాగ్రి లేక పోవడంతో ఇబ్బందులు గుర్తించారు. వారికి అవసరమైన సామాగ్రి సమకూర్చి విద్యార్థుల్లో ప్రోత్సాహాన్ని నింపారు. చిందేపల్లిలో అంగన్‌వాడీ భవనంలో అవసరమైన సదుపాయాలు కల్పించి రంగులు వేయించి అందంగా తీర్చిదిద్దారు.

రైతులకు చేయూత

కొండప్రాంత్రాల నుంచి చెరువుల్లోకి నీరు వచ్చే వరవకాలువలు పిచ్చి మొక్కలతో పూర్తి స్థాయిలో పూడిపోవడంతో ప్రతిఏటా వర్షాకాలంలో చెరువుల్లోకి నీరు రానిపరిస్థితి. దీన్ని గుర్తించి ఐఐటీ విద్యార్థులు చిందేపల్లి చెరువు వరవకాలువలో పిచ్చి మొక్కలు తొలగించడమే కాకుండా పూడికతీత పనులు చేపట్టి సమస్య పరిష్కరించారు. ఐఐటీలోని కొలనులు చుట్టూ ఉన్న వ్యర్థాలను తొలగించి పరిశుభ్రంగా మార్చారు. వర్షాకాలంలో కొలనులు నిండిన వెంటనే కింద స్థాయి చెరువులకు నీరుచేరే విధంగా చర్యలు తీసుకున్నారు.

గ్రామీణప్రాంతాలపై అవగాహన



పల్లెలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే సులభతరంగా దేశాభివృద్ధి జరుగుతుందని పుస్తకాల్లో మాత్రమే చదువుకున్నాం. క్షేత్రస్థాయి పర్యటనలో గ్రామీణులు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లారా చూసి వారికి అండగా నిలవాలనే భావన కలిగింది. తమవంతు సాయంగా సేవచేయడం ఆనందంగా ఉంది. **- చైతన్య**

మరిన్ని సేవా కార్యక్రమాలు



ఐఐటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఇప్పటికే కొన్ని గ్రామీణ ప్రాంతాలను దత్తత తీసుకుని సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. అయితే స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా అదనంగా పలు గ్రామాల్లో పర్యటించి సమస్యలు గుర్తించాం. కొన్నింటిని పరిష్కరించేలా చర్యలు తీసుకున్నాం. దీంతో విద్యార్థుల్లో సేవాభావం పెరిగేందుకు ఎంతగానో దోహదపడుతుంది. **- మహేష్**

అటెండర్‌పై వేటు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మహాద్వారం వద్ద విధులు నిర్వహిస్తున్న అటెండర్‌పై ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తాత్కాలికంగా విధుల నుంచి తప్పించారు. అయితే విధి నిర్వహణకు రాకపోవడం, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా గైర్హాజరు కావడంపై చర్యలు తీసుకున్నారు.

గూడూరు
• గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 60 నుంచి రూ. 90 వరకు
రెండో రకం: కిలో రూ. 50 నుంచి రూ. 60 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	134
లేయర్	110
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	187

సాదాసీదాగా మండల సర్వ సభ్య సమావేశం .. తడ : తడ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ కె.రమురెడ్డి ఆధ్వర్యంలో సాదాసీదాగా సాగింది. సభ్యులు ఎలాంటి సమస్యలను సమావేశంలో ప్రస్తావించలేదు. ఇన్‌చార్జి ఎంపీడీవో విజయకుమార్, వైఎస్ఎంపీపీ వెంకటేష్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కల్యాణోత్సవం

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని [illegible] ధ్యాన మందిరంలో మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. వల్లీ,దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి కల్యాణం వేడుకగా జరిగింది. భక్తులకు మందిరంలో అన్నప్రసాదం అందించారు.



దేవీ,వల్లీసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేకాలంకరణ

తెదేపా నేతకు నెలవల పరామర్శ

నాయుడుపేట : పట్టణంలో రాజగోపాలపురంలో తెదేపా మాజీ కౌన్సిలర్ శేషం మునిగోపి తల్లి మస్తానమ్మ బుధవారం మృతి చెందడంతో ఆమె మృతదేహాన్ని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం. పట్టణ తెదేపా ప్రధాన కార్యదర్శి నానబాల సుబ్బారావు, పలువురు తెదేపా నాయకులు కార్యకర్తలు సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం మునిగోపిని పరామర్శించారు.



భాజపా సభ్యత్వ నమోదు చేపడుతున్న జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప

భాజపాతోనే అభివృద్ధి

వెంకటగిరి, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో దేశాభివృద్ధి సాధ్యమవుతుందని భాజపా జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప అన్నారు. మండలంలోని మొగళ్లగుంట, గొట్లగుంట గ్రామంలో సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో భారతదేశం ప్రపంచంలో విశ్వగురువు అవతరించనుందని అన్నారు. కూటమి సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గురుప్రసాద్, నేతలు శివకోటి, వినయ్‌కుమార్, పెరుమాళ్లు పాల్గొన్నారు.

పెరిమిటిపాడులో ఉద్రిక్తత

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని ఇలుపూరు పంచాయతీ పెరిమిటిపాడులో ప్రహరీ గోడ కూల్చివేతపై మంగళవారం ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. గ్రామంలో రమేష్ ఇంటి నిర్మాణం చేపట్టారు. అతను వీధిని ఆక్రమించి గోడ నిర్మాణం చేపట్టారని స్థానికులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. గ్రామానికి సర్వేయర్, ఇతర అధికారులు వెళ్లి సర్వే చేయగా ఇంటికి ఈశాన్య దిక్కున పిల్లర్‌తో పాటు, అడుగు మేర ఆక్రమించి గోడ నిర్మించినట్లు గుర్తించారు. ఆక్రమణను కూల్చేందుకు మంగళవారం ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, కార్యదర్శి రాజారెడ్డి, పోలీసులను వెంటబెట్టుకుని వెళ్లారు. పొక్లెయిన్‌తో గోడను కూల్చేందుకు ప్రయత్నించగా ఇంటి యజమాని దానికి అడ్డుగా పడుకున్నాడు. ఈ సమయంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు అతన్ని పక్కకు లాగి గోడను కూల్చేశారు.



పొక్లెయిన్‌కు అడ్డుపడిన యువకుడు

పంచాయతీ తీర్మానం లేకుండానే..

సర్పంచి తెరే కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా ఎలా ఆక్రమణలను తొలగిస్తారని ప్రశ్నించారు. కనీసం పంచాయతీ కార్యదర్శి తనకు సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఏకపక్షంగా కూలీ పనులు చేసుకుని జీవించే రమేష్ గోడను కూల్చేశారని ఆయన తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు

పేదలకు భూములు అందించడమే ధ్యేయం

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: భూ పోరాటాలు చేసి లక్షల ఎకరాల భూమిని పేదలకు అందజేసిన ఘనత వ్యవసాయ కార్మిక సంఘానికే దక్కుతుందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరరావు, శేఖర్ తెలిపారు. గూడూరుపట్టణంలోని షాదీమంజిల్ వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ పటిష్టతో గ్రామస్థాయి నుంచి కార్మిక సంఘం బలోపేతం కావాలని చెప్పారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తులసిరాజన్, పెంచలయ్య, కృష్ణప్ప, ప్రభాకర్, కాలేషా పాల్గొన్నారు.

పచ్చిరొట్ట వినియోగంతో అధిక దిగుబడులు

వెంకటగిరి : పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసి పొలంలో కలియదున్నడంతో అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ ఏడీ నాగార్జున సాగర్ అన్నారు. మండలంలోని జంగాలపల్లి, పెట్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు ఆర్ఎన్ఆర్ 15048 రకం సాగు చేయాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలైన ఉద్యాన, కూరగాయలు పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ వైద్యాధికారి కిషోర్, వ్యవసాయాధికారిణి సుజాత, కేవీకే శాస్త్రవేత్త నాయక్ తదితరులు పాల్గొన్నారు. **కోట :** కోట, ఎన్‌పీకొత్తపాళెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ మాట్లాడుతూ రైతులు శుద్ధి చేసిన విత్తనాలను వినియోగించాలన్నారు. రైతులు, వ్యవసాయ శాఖ, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. **నాయుడుపేట :** మండలంలో గొట్టిప్రోలు, పూడేరు గ్రామాల్లో రైతులకు మండల వ్యవసాయాధికారి జే.గణేష్ నారుమడి తయారీ అవగాహన కల్పించారు. పంట సాగుకు ముందు నారుమడి తయారి విత్తనాలు చల్లడం, మొలకశాతం గుర్తించడం వంటి అంశాలను వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు చెంగల్‌రాజులు, రైతులు పాల్గొన్నారు.

కొల్లగొట్టిన వారిపై చర్యలేవీ?

❖ తప్పించుకుంటున్న అధికారులు ❖ హైకోర్టు ఆదేశాలున్నా పట్టింపేది

గూడూరు, పెళ్లకూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రజాప్రతినిధుల అండతో కొండలు, గుట్టలు, చెరువులు, పొర్లు కట్టలు కొల్లగొట్టిన నేతలపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. హైకోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా తప్పించుకుంటున్నారు. తిలాపాపం తలా పిడికెడన్నట్లు వ్యవహరించి బదిలీపై వెళ్లిన అధికారులకు తమకు సంబంధం లేదన్నట్లు కొత్తగా వచ్చిన అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇలా రూ.కోట్లు వెనకేసుకున్న నేతల లెక్కలు తీయాల్సిన యంత్రాంగం తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి..

సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఓ వైకాపా నేత బరితెగించి రోసనూరు కొండను కొల్లగొట్టారు. ఇందులో రూ.కోట్లు వెనకేసుకుని చెలరేగారు. అధికారుల కళ్ల ముందే స్వర్ణముఖి పొర్లుకట్ట, చెరువులు, వాగులు, తెలుగుగంగ కాల్వ అంచులు తవ్వేశారు. ఇక్కడి మట్టి గ్రావెల్ జాతీయ రహదారి, స్థిరాస్తి క్షేత్రాలకు తరలించి భారీగా ఆర్జించారు. ఇక్కడి నేతపై స్థానికులు కోర్టును ఆశ్రయించి స్టేలు తెచ్చారు. ఇంత చేసినా ఇక్కడి అధికారుల్లో చలనం లేకుండానే తవ్వకాలు జరిపించేశారు.

వసూళ్లలో కదలికేది..

రోసనూరు, శిరసనంబేడు కొండల్లో తవ్వకాల లెక్కలు తేల్చిన అధికారుల బృందాలు వాటిని హైకోర్టుకు అందజేశాయి. ఇలా అప్పట్లోనే సుమారుగా రూ.50 లక్షల మేర జరిమానాలు లెక్కించారు. ఇలా మట్టి తవ్వకాల్లో మరో పాతిక లక్షలు, పొర్లు కట్ట తవ్వకాలు రూ.2 కోట్లు లెక్కన అంచనాలు తయారు చేశారు. వీటన్నింటి లెక్కలు తీసిన అధికారులు ప్రస్తుతం వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో ఈ లెక్కలు ఎవరు తీస్తారన్న చర్చ నడుస్తోంది.



రోసనూరు కొండను కొల్లగొట్టిన తీరు

దర్జాగా అక్రమార్కులు తిరుగుతున్నా..

గనుల దోపిడీలో పెద్దఎత్తున ఆర్జించిన నేత దర్జాగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. తదుపరి చర్యలకు ఉపక్రమించడం లేదు. ఉదాహరణకు పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డిపాళెం పొర్లు కట్ట లెక్కలు తేల్చి రూ.2 కోట్లు విలువైన మట్టి తరలించినట్లు ప్రాథమికంగా గుర్తించి కేసు నమోదు చేశారు. దీనిపై రికవరీ చర్యలకు అటు రెవెన్యూ, ఇటు జల వనరుల శాఖ చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.



బంగారంపేట చెరువులో తవ్వకాలు

చర్యలు తీసుకుంటాం

ఇప్పటికే ఉన్న నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటాం. జరిమానాలు వసూళ్లకు ఏర్పాట్లు చేస్తాం.

- శ్రీనివాస్, ఏడీ గనుల శాఖ, గూడూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే

సమస్య: గూడూరు టిడ్కో గృహాల సముదాయ ప్రాంతం చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిపోవడంతో, విష పురుగుల, పాములతో భయాందోళన చెందుతున్నాం. అధికారులు స్పందించి, చెట్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలి. - **మురళీకృష్ణ, గూడూరు**

సమాధానం: టిడ్కో గృహాల వద్ద ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. చెట్లను జేసీబీతో తొలిగించేలా కృషి చేస్తాం. - **వెంకటేశ్వర్లు, పురకమిషనర్, గూడూరు**

న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

సమస్య: పురపాలక సంఘంలోని కోళ్లమిట్ట ప్రాంతంలో రేడియో రూం వీధి చివర్లో వీధి దీపం వెలగడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. - **రవిరెడ్డి, కోళ్లమిట్ట**

సమాధానం: సచివాలయ సిబ్బందికి సూచించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి, వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - **చిన్నయ్య, పుర కమిషనర్**

నాయుడుపేట, న్యూస్‌టుడే

సమస్య: నాయుడుపేట పట్టణం భరత్‌నగర్‌లో చివరి భాగంలో మురికినీటి కాలువ పూడికతో నిండి నీరు సాఫీగా వెళ్లడంలేదు, మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. **రమేష్, స్థానికుడు**

సమాధానం: భరత్ నగర్ ప్రాంతాన్ని పరిశీలించి మురుగునీటి కాల్వలో పూడికను సిబ్బంది ద్వారా తొలగించే ప్రయత్నాలు చేస్తాను.

- **ఎస్.ఫజులుల్లా, పురకమిషనర్ నాయుడుపేట**

రహదారికి మరమ్మతు

వాకాడు మండలం స్వర్ణముఖి నది కట్టపై వాకాడు-చిట్టమూరు బైపాస్ ర.భ. రోడ్డు గత కొంత కాలంగా గుంతలమయంగా మారి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. దాంతో పలుమార్లు ఈ రోడ్డు తీరుపై ఈనాడులో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన పలుమార్లు వార్తలు ప్రచురించడం జరిగింది. స్పందించిన ర.భ. గూడూరు ఈఈ రామాంజనేయులు మంగళవారం బైపాస్ రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్పించారు.

- **న్యూస్‌టుడే, వాకాడు**

గుంతల పూడ్చివేత

స్పందనకు వందనం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట రాజగోపాలపురం ఐదో వీధి మలుపులో గ్యాస్ పైపులైను కోసం తీసిన గోతులను మంగళవారం నిర్వాహకులు తమ సిబ్బందితో పూడ్చేలా చేశారు. నాలుగైదు రోజుల క్రితం గోతిలో పడి పలువురు గాయపడుతున్నారని 'మేమున్నాం.. మీతోడుగా' వార్త ప్రచురితం కావడంతో గ్యాస్ పైపులైను పనులు చేయించే సిబ్బంది గోతులను పూడ్చి బాగు చేశారు.

చెత్తాచెదారం తొలగింపు

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పురపాలక సంఘం పరిధిలోని గూడూరు-వెంకటగిరి ప్రధాన రహదారిపై చెత్త చెదారాలు అధికంగా ఉండడంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఈనాడులో మేమున్నాం..మీకు తోడుగా శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బంది ద్వారా చెత్తచెదారాలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. **నాయుడుపేట :** మండలంలో కొనేటిరాజుపాళెం సమీపంలో రహదారి పక్కనే చెత్త పేరుకుపోయి ఉండడంపై ఈనెల ఐదో తేది ఈనాడులో వచ్చిన మేమున్నాం మీకోసం శీర్షిక స్పందించిన పంచాయతీ సిబ్బంది ఆ ప్రాంతంలో ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు.



వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న పోర్టు ప్రతినిధులు

క్రీడాభివృద్ధికి కృషి

చిల్లకూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఎస్ఆర్ హెచ్ రాజేష్‌రంజన్ అన్నారు. తమ్మినపట్నం పంచాయతీ పరిధిలోని యువతకు మంగళవారం వాలీబాల్ కిట్లను అందజేశారు. శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. స్థానిక సర్పంచి సుబ్రహ్మణ్యం, పోర్టు ప్రతినిధులు రమేష్‌బాబు, అశోక్ పాల్గొన్నారు.



ఆలయ ఈవోకు చెక్కు అందజేస్తున్న దాతలు

నిత్యాన్నదానానికి రూ.1,11,111 వితరణ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి స్థానికుడు ఎం.ఎం.అశోకుడు కుటుంబ సభ్యులు రూ. 1,11,111 వితరణ చేశారు. సంబంధిత నగదు చెక్కును మంగళవారం ఈవో ప్రసన్నలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యురాలు ఎం.ఎం. పద్మజ పాల్గొన్నారు.



తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన నాయుడుపేట విద్యార్థిని

తైక్వాండో పోటీల్లో ప్రతిభ

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: తిరుపతిలో ఈనెల 6వ తేదీ నుంచి జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో నాయుడుపేట విద్యార్థిని బి.దీపిక అండర్-17 విభాగంలో తృతీయ స్థానంలో నిలిచింది. నెల్లూరు తరఫున నాయుడుపేట విద్యార్థులు ఏడు మంది పాల్గొనగా దీపిక ప్రతిభ చూపి ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ రవినాయుడు, ఎస్‌జీఎఫ్ క్రీడా నిర్వాహకులు చేతులు మీదుగా పతకం అందుకుంది. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోచ్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.



సూళ్లూరుపేట: బాలాత్రిపుర సుందరీగా కన్యకా పరమేశ్వరి



వెంకటగిరి: మహాలక్ష్మిగా మందనాంచారేశ్వరి దేవీ



సూళ్లూరుపేట: మహాలక్ష్మి అలంకారంలో చెంగాళమ్మ పరమేశ్వరి



గూడూరు: ప్రత్యేక అలంకరణలో రామలింగాచామండేశ్వరిదేవి



కోట: వాసవీకన్యకా పరమేశ్వరిదేవి



సూళ్లూరుపేట: శ్రీమహాలక్ష్మి అలంకారంలో దుర్గామల్లేశ్వరి..



చిల్లకూరు: పూసల అలంకారంలో అమ్మవారు

దుర్గమ్మా.. దయ చూపమ్మా

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాల్లో మంగళవారం విశేష పూజలు జరిగాయి. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహాలక్ష్మి, ధనలక్ష్మి వంటి అలంకరణలు చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల భక్తులకు అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- **న్యూస్‌టుడే బృందం**



వెంకటగిరి: ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు



గూడూరు: గంగమ్మకి పూజలు చేస్తున్న భక్తులు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట తుమ్మూరు సబ్ స్టేషన్ పరిధిలోని పట్టణ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ వెంకటస్వామి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సీఐటీయూ నాయకుల నిరసన

నాయుడుపేట పట్టణం : నాయుడుపేట భరత్ నగర్ వద్ద సాంసంగ్ ఏజన్సీ ఎదుట మంగళవారం సీఐటీయూ నాయకులు, కార్మికులు నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జెండాలతో నిరసన తెలిపారు. ప్రైవేటు ఏజెన్సీకు వ్యతిరేకగా నినదించారు. సీఐటీయూ మండల కార్యదర్శి మకుంద, కార్మికులు పాల్గొన్నారు.

భక్తుల నిలువు దోపిడీ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ఆంధ్ర, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయంలో భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఇక్కడకు వచ్చే భక్తులు అధిక ధరలకు సామగ్రిని కొనుగోలు చేయాల్సి పరిస్థితి ఏర్పడింది. ఆలయ దుకాణ సముదాయాల్లో అధిక ధరల విషయమై పలుమార్లు భక్తులు ఆలయ ఉద్యోగులకు ఫిర్యాదు చేసినా మార్పులేదు. ప్రస్తుతం ఆలయంలో దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళ భక్తుల సందడి నెలకొంది. అయితే ఆలయ ఆవరణలోని దుకాణాల్లోని సామగ్రి ధరలు చుక్కలు అంటుతున్నాయి. ముఖ్యంగా కొబ్బరికాయ బుట్టను రూ.70ల వరకు విక్రయిస్తున్నారు. లీటరు నీళ్ల సీసా రూ.30కి విక్రయిస్తున్నారు. శీతల పానీయంపై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా కొబ్బరికాయ బుట్ట విక్రయాల్లో మరింత మోసం జరుగుతోంది. ఆలయ ఈవో, సిబ్బంది కార్యాలయాలకు అతి సమీపంలోని దుకాణాల్లో భక్తులకు వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇదే తరహాలో తినుబండారాలను కూడ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దేవస్థానంలో కొన్నాళ్ల వరకు రెగ్యులర్ ఈవో, ధర్మకర్తల మండలి లేదు. ఇన్‌ఛార్జి పాలన కొనసాగింది. ఆ సమయంలో ఆలయంలో పాలన గాడి తప్పింది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో చిత్తూరు నుంచి రెగ్యులర్ ఈవో వచ్చారు. నూతన ఈవో ప్రత్యేక దృష్టి పెట్టి భక్తులకు మెరుగైన వసతులు కల్పించి అధిక ధరలను కట్టడి చేయాలని భక్తులు కోరుతున్నారు.



సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

చిల్లకూరు, న్యూస్‌టుడే: గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మనగారిపాలెంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. కడప జిల్లా ఎర్రగుంట్ల ప్రాంతానికి చెందిన డ్రైవర్ ఎలకల శ్రీకాంత్ రెడ్డి(34) వాహనాన్ని తీసుకుని స్థానిక పరిశ్రమ నుంచి సిలికా తీసుకువెళ్లేందుకు వచ్చారు. ఈ క్రమంలో లారీలో విశ్రమిస్తూ మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టిప్పర్ల స్వాధీనం

తడ, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా క్వారీ డస్ట్‌ను శ్రీకాళహస్తి నుంచి మాంబట్టు సెజ్‌కు తరలిస్తున్న రెండు టిప్పర్లను తడ ఎస్సై కొండప్పనాయుడు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా వీటిని అదుపులోకి తీసుకుని వాణిజ్య పన్నుల శాఖకు అప్పగించారు.



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఎన్‌బీకేఆర్‌కు న్యాక్ ఏ గ్రేడ్

కోట, న్యూస్‌టుడే: కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్సు అండ్ ఆర్ట్స్ కళాశాలను న్యాక్ పీర్ కమిటీ బృందం పరిశీలించి న్యాక్ ఏ గ్రేడ్‌ను ప్రకటించిందని విద్యా సంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం ఆయన అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 59 ఏళ్లుగా ఎన్‌బీకేఆర్ విద్యా సంస్థలు దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి, దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి ఆశయాలకు అనుగుణంగా సామాజిక సేవ దృక్పథంతో పేద విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను బోధిస్తుందన్నారు. ఈ క్రమంలోనే విద్యాసంస్థలు యూనివర్సిటీ స్థాయికి తీసుకు వస్తామన్నారు. విద్యాసంస్థల కార్యదర్శి దామోధరరెడ్డి, మేనేజర్ రామకృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్, ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా స్వామివారి కల్యాణం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక బ్రాహ్మణవీధిలోని శ్రీ మహాలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవతామూర్తుల కల్యాణం మంగళవారం కనులవిందుగా సాగింది. ఉత్సవ విగ్రహాలకు అలంకరణలు చేసి వేద పండితులు పూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి దేవతామూర్తుల విగ్రహాలను రథంపై ఉంచి ఊరేగించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాల్లో హైడ్రామా

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం రావులపాడు చెరువులో మట్టి తవ్వకాల్లో మంగళవారం హైడ్రామా నడిచింది. ఇక్కడ ఓ వైకాపా నేత వాహనాలను అడ్డుకుని నానా యాగీ చేశారు. ఆ తర్వాత మంది మార్బలంతో వెళ్లి బేరాలు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. గ్రామ అవసరాల పేరులో లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతకు ముందు పోలీస్, ఇతర శాఖలకు సమాచారమిచ్చి, అంతా సర్దుకొన్నట్లు సెలవివ్వడం గమనార్హం.

ముగ్గురికి గాయాలు

నాయుడుపేట పట్టణం : నాయుడుపేట తుమ్మూరు వద్ద మంగళవారం రాత్రి ఆటో ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓజిలి మండలం సగుటూరుకు చెందిన సతీష్, వెంకటేష్, అంకయ్యలు గాయపడ్డారు. నాయుడుపేట నుంచి తిరిగి వెళ్తుండగా తుమ్మూరు వద్ద ఆటోను ఢీకొని గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదవి పోయినా.. పరపతి అలాగే

పెళ్లకూరు, న్యూస్‌టుడే: ఆయన పదవి పోయి ఐదు నెలలైంది. అయినప్పటికీ ఇంకా దర్పం మాత్రం అలాగే కొనసాగిస్తున్నారు. పెళ్లకూరు మండలం చిల్లకూరుకు చెందిన ఎన్‌డీసీసీబీ మాజీ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి తన హోదా కారుకు అలాగే తగిలించి రోడ్లపై పోలీస్ సైరన్‌తో తిరుగుతున్నారు. తాజాగా పెళ్లకూరు నుంచి నాయుడుపేట వెళ్లే క్రమంలో రహదారిపై ఇలా పోలీస్ సైరన్‌తో వెళ్లడం విమర్శలకు తావిచ్చింది. దీనిపై కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

